హామీలపై అడుగుపడితే ఒట్టు

- గుంటూరు చానల్ పొడిగింపు ఊసేలేదు..?
- జాడలేని సెంట్రల్ లైటింగ్
- అడ్రస్ లేని ఐటీ కారిడార్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు
- 180 రోజుల్లో చేస్తామన్నారు.. వంద రోజులైపోయాయి
- సమీక్షలతో ఎమ్మెల్యే బూర్ల కాలక్షేపం


ప్రత్తిపాడు గ్రామంలోని సెంటర్


ప్రత్తిపాడు- గొట్టిపాడు మధ్య అధ్వానంగా ఉన్న రోడ్డు

ప్రత్తిపాడు: మేం అధికారంలోనికి వచ్చిన ఆరు నెలల్లో ప్రధానమైన హామీలు అమలు చేస్తామని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ఎన్నికల సమయంలో. హామీ ఇచ్చారు. వంద రోజులు పూర్తయ్యింది. ఇప్పటి వరకు ఏ ఒక్క హామీ కూడా పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోలేదు. ఒకటి రెండు మినహా ఏ హామీపై కూడా క్షేత్రస్థాయిలో అడుగు ముందుకు పడిన దాఖలాలు లేవు. కలెక్టర్‌గా పనిచేసిన అనుభవాన్ని రంగరించి నియోజకవర్గంలో ప్రగతిని పరుగులు పెట్టిస్తారని ఆశించిన ప్రజలకు ఆశాభంగం తప్పడం లేదు.

ప్రత్తిపాడు సెంట్రల్ లైటింగ్..

నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడం. కనీసం అధికారులతో చర్చించిన దాఖలాలు కూడా లేదు. ప్రధాన రహదారిలో అక్కడక్కడా గోతులు పడి ప్రయాణికుల నడ్డి విరుగుతోంది. నిత్యం ఈ మార్గంలో వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతుండగా, వేల సంఖ్యలో ప్రజలు ప్రయాణం చేస్తుంటారు. గుంటూరు. బాపట్ల, ప్రకాశం జిల్లాలను కలిపే పాత మద్రాసు రోడ్డుపై అదే చిన్నచూపును ప్రదర్శిస్తున్నారు.


హామీలపై మీడియాతో మాట్లాడుతున్న బూర్ల రామాంజనేయులు (ఫైల్)

నిరుద్యోగ యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు..

నిరుద్యోగ యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేయడమనేది ఎమ్మెల్యే ఇచ్చిన ప్రధానమైన హామీల్లో మరొకటి. దీనిపై కూడా నీలినీడలే కమ్ముకున్నాయి. గద్దెనెక్కి సెంచరీ రోజులు పూర్తవుతున్నా కార్యచరణ దిశగా అడుగులు పడిన దాఖలాలు కనిపించడం లేదు. ఇక కూటమి ప్రభుత్వం ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీ ఎప్పుడు అమలు అవుతుందో కూడా అర్థంకాని పరిస్థితి. నియోజకవర్గంలో దాదాపుగా 90 వేల మంది నిరుద్యోగ యువత ఉన్నారు. వారి కోసం డిజిటల్ లైబ్రరీలు కూడా ఏర్పాటు చేస్తానని అప్పట్లో ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అదీ ఆచరణకు దూరంగానే కనిపిస్తుంది.

ఇవి కాక ఇచ్చిన హామీలో మరికొన్ని..

- ఉద్యోగాలు చేసే మహిళల సౌకర్యార్థం వసతి గృహాల ఏర్పాటు
- ఐటీ కారిడార్ ఏర్పాటు
- పదకొండు విలీన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన
- ఐదో మైలు నుంచి పెదనందిపాడు వరకు పాత మద్రాసు రోడ్డును నాలుగు లైన్లుగా విస్తరించడం
- దెబ్బతిన్న రోడ్ల నిర్మాణం



హామీలపై అప్పట్లో ఈనాడు పత్రికలో ఇచ్చిన ఇంటర్వ్యూ (ఫైల్)

గుంటూరు చానల్ ఆధునికీకరణ..

గుంటూరు చానల్‌ను పర్చూరు వరకూ పొడిగించడం మరో హామీ. అది కూడా మొదటి ప్రాధాన్యంగా తీసుకుని 180 రోజుల్లోనే కీలకమైన చర్యల దిశగా అడుగులు వేస్తామని చెప్పారు. కానీ నేటి వరకు అధికారులతో సమీక్షలే గానీ కీలకంగా పడిన అడుగులు మాత్రం లేవు. ఈ చానల్‌పై ఆధారపడి సుమారు యాభై గ్రామాలకు సాగు, తాగునీరు ఉంటుంది. అదే విధంగా నల్లమడ వాగు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



వంద శాతం హామీల మునక


చేబ్రోలు మండలం వడ్లమూడి గరువుపాలెం వద్ద తెనాలి వెళ్లే ప్రధాన రహదారి దుస్థితి

- ఇచ్చిన హామీల అమలుపై దృష్టి లేదు
- అధ్వానంగా మారిన రోడ్లు
- అధ్వాన డ్రెయిన్లతో ముంపునకు గురవుతున్న పొలాలు
- వంద రోజుల పాలనలో అభివృద్ధి శూన్యం
- ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రపై ప్రజలు అసంతృప్తి

చేబ్రోలు: టీడీపీ ఎన్నికల్లో ఇష్టానురీతిలో హామీలను గుప్పించారు. వంద రోజుల్లో అద్భుతాలు సృష్టిస్తామని చెప్పారు. ఇంటింటికి వెళ్లి అందరికీ న్యాయం అంటూ ఉదరగొట్టారు. రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని పొన్నూరు, చేబ్రోలు, పెదకాకాని మండలాల పరిధిలో వందలాది వాగ్దానాలు చేశారు. కానీ ఒక్క ప్రధాన హామీని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అమలు చేయలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

హామీలు ఇలా..

- మూడు మండలాల పరిధిలో రోడ్లు అధ్వానంగా ఉన్న రహదారులను అభివృద్ధి చేస్తామని, వాటి రూపు రేఖలు మార్చుతామని చెప్పారు.
- మండలంలో వివిధ గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవటంతో వాటిని అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించారు.
- పొలాల్లోని డొంక రోడ్లు, అంతర్గత రహదారులను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.
- సాగునీటి, మురుగునీటి కాలువలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.


డ్రెయిన్లపై దృష్టి పెట్టకపోవడంతో వర్షాలకు నీటమునిగిన పంటలు(ఫైల్)

హామీలకు అతీగతి లేదు..

కొద్ది రోజుల క్రితం భారీ వర్షాలు కురవటంతో పొలాల్లోని నీరు బయటకు పోయే మార్గం లేకపోవటంతో పొలాలు ముంపు బారినపడ్డాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో కాలువలకు మరమ్మతులు, అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉన్నప్పటికీ చేపట్టకపోవటంతో పొలాలు ముంపు బారిన పడటానికి కారణమని రైతులు ఆరోపిస్తున్నారు.

- నారాకోడూరు నుంచి తెనాలి వైపు ప్రధాన రహదారి గుంతమయంగా మారింది. వడ్లమూడి గరువుపాలెం వద్ద మెయిన్ రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వాటికి తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టకపోవటంతో ప్రతి రోజు వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. ఇకనైనా ప్రధాన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ప్రజానీకం కోరుతున్నారు.


క్లుప్తంగా

ప్రజా సంక్షేమమే కూటమి ధ్యేయం




పొన్నూరు: ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. పట్టణంలోని డీవీసీ కాలనీలో శుక్రవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. సభకు మున్సిపల్ కమిషనర్ ముప్పాల రమేష్‌బాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ పాల్గొని వంద రోజుల పాలనలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయులు, రెవెన్యూ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు. ఆరెమండలో ఎంపీడీఓ అడిగోపుల శ్రీనివాసరావు, నాయకులు పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం 100 రోజుల్లో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు.

సీతారాం ఏచూరి ఆశయాలను కొనసాగించాలి



పెదకాకాని: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి దివంగత సీతారాం ఏచూరి ఆశయాలను కొనసాగించాలని ఆ పార్టీ నాయకుడు వై.నేతాజి పేర్కొనారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం గ్రామ శాఖ మహాసభ జి.రాజారమేష్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శాఖ కార్యదర్శిగా బేతపూడి బాబూరావు, సహాయ కార్యదర్శిగా జి. రాజా రమేష్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మహాసభలో పలు సమస్యలపై తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ, కె.సత్యనారాయణ, యు.శివయ్య, బి.సాంబయ్య పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



గుంటూరు రూరల్: తిరుపతి దేవుని దర్శనం చేసుకుని గుంటూరు వస్తున్న కారును వెనుక నుంచి లారీ ఢీకొన్న ఘటనలో నలుగురికి స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు.. గుంటూరుకు చెందిన నలుగురు కారులో తిరుపతిలో దేవుని దర్శనం చేసుకుని తిరిగి గుంటూరు వస్తున్నారు. అంకిరెడ్డిపాలెం వద్ద హైవే దాటుతున్న సమయంలో వెనుక చెన్నై నుంచి వస్తున్న లారీ కారును ఢీకొంది. కారు నుజ్జునుజ్జు అయింది. లారీ బోల్తా పడింది. కారులోని ఇరువురు వ్యక్తులకు, లారీ డ్రైవర్, క్లీనర్‌లకు గాయాలు అయ్యాయి. స్థానికులు స్పందించి క్షతగాత్రులను జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు పరీక్షించి క్షతగాత్రుల పరిస్థితి బాగానే ఉందని చెప్పారు.

చలపతిలో దూర విద్య కేంద్రం ప్రారంభం

డ్యూయల్ డిగ్రీకి అవకాశం

గుంటూరు రూరల్: చలపతి ఎడ్యుకేషన్ సొసైటీ, చలపతి డిగ్రీ కాలేజ్ కేంద్రంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూర విద్య కేంద్రం అనుబంధంతో సర్టిఫికెట్, డిప్లొమా అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్స్ నుంచి 28 కోర్సులను 2024-2025 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించనున్నట్లు చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు తెలిపారు. శుక్రవారం నగర శివారుల్లోని లాంలోని చలపతి ఫార్మసీ కళాశాలలో దూరవిద్యాకేంద్రం ప్రారంభ బ్రోచర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా చలపతి విద్యాసంస్థల అధినేత మాట్లాడుతూ చలపతి డిగ్రీ కళాశాల కేంద్రంగా ఏర్పాటైన దూర విద్యకేంద్రంలో డిప్లొమా కోర్సులలో భాగంగా ఫుడ్ ప్రొడక్షన్, సైకలాజికల్ గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్ కోర్స్ అందించనున్నట్లు పేర్కొన్నారు. సర్టిఫికెట్ కోర్సులలో హోటల్ అండ్ హాస్పిటల్ హౌస్ కీపింగ్, హెచ్ఐవీ, ఎయిడ్స్ కౌన్సెలింగ్ కోర్సులు ఉన్నాయని వివరించారు. అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులలో బీఏ(ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటిక్స్), బీఏ(ఎకనామిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటిక్స్), బీఏ(ఎకనామిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ), బీఏ(ఎకనామిక్స్, హిస్టరీ, సోషియాలజీ), బీఏ(ఎకనామిక్స్, పొలిటిక్స్, సోషియాలజీ), బీఏ(హిస్టరీ, పొలిటిక్స్, సోషియాలజీ), బీఏ(పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హిస్టరీ, పొలిటిక్స్), బీఏ(స్పెషల్ ఇంగ్లిష్, హిస్టరీ, స్పెషల్ తెలుగు), బీఏ(ఎకనామిక్స్, బ్యాంకింగ్, కంప్యూటర్ అప్లికేషన్స్), బీకాం(కంప్యూటర్ అప్లికేషన్స్), బీకాం(జనరల్), బీబీఏ(బిజినెస్ అడ్మినిస్ట్రేషన్) కోర్సులను అందుబాటులో ఉన్నాయన్నారు. అదేవిధంగా పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులలో యమ్ఏ(ఇంగ్లీష్), యమ్ఏ (ఎకనామిక్స్), ఎంఏ(హిస్టరీ), ఎంఏ(పొలిటికల్ సైన్సెస్), ఎంఏ(సోషియాలజీ), ఎంఏ(జర్నలిజం మాస్ కమ్యూనికేషన్), ఎంఏ(హ్యూమన్ రిసోర్స్ మేనేజిమెంట్), ఎంఎస్‌డబ్ల్యూ(మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్), ఎంకాం(అకౌంటెన్సీ), ఎంకాం (బ్యాంకింగ్) కోర్సులు ఉన్నాయన్నారు. అదే విధంగా బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ ఇన్ఫర్మేషన్ సైన్సెస్(బీఎల్ఐఎస్‌సీ) మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్(ఎంఎల్ఐఎస్‌సీ) కోర్సులను ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆయా కోర్సులలో చేరాలనుకుంటే హెచ్‌టీటీపీఎస్.ఏఎన్‌యూసీడీఈ.ఓఆర్‌జీ.డాష్‌బోర్డ్.అనాలసిస్ట్స్ వెబ్‌సైట్ ద్వారా అడ్మిషన్స్ పొందవచ్చని తెలిపారు. ఈ కోర్సులలో ప్రవేశం పొందిన విద్యార్థులు ప్రతి ఆదివారం చలపతి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో క్లాసులు జరుగుతాయన్నారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ(ఎన్ఈపీ)2020కు అనుగుణంగా ప్రతి విద్యార్థి ఫార్మసీ, ఇంజినీరింగ్‌తోపాటు అదనంగా ఒకటి లేదా రెండు డ్యూయల్ డిగ్రీలు పొందే అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు పాల్గొన్నారు.


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న హెచ్‌ఎం


ప్రత్తిపాడు హైస్కూల్లో పోటీలు

పెదకాకాని: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నంబూరు తిరుపతిరావు అన్నారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఇండియా క్రీడా పోటీలు శుక్రవారం ప్రారంభించారు. పోటీలను పాఠశాల హెచ్‌ఎం నంబూరు తిరుపతిరావు, విద్యా కమిటీ చైర్మన్ సీహెచ్ వెంకటేశ్వరరావు ప్రారంభించారు. తొలిరోజు శుక్రవారం అండర్- 17, అండర్- 14 బాల బాలికల జట్లు వాలీబాల్, ఖోఖో, యోగ పోటీల్లో పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు. మండలంలోని 10 పాఠశాలల నుంచి సుమారు 200 మంది బాల బాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలను పాఠశాల వ్యాయామోపాధ్యాయుడు మస్తాన్‌రెడ్డి, ఉపాధ్యాయుడు ఎస్.వెంకటరెడ్డి పర్యవేక్షించారు.

ఖోఖో అండర్- 17 బాలుర విభాగంగా విన్నర్ జేఎంజే(నంబూరు), రన్నర్ జెడ్పీహెచ్ స్కూల్(వెనిగండ్ల), బాలికల విభాగంలో విన్నర్‌గా జెడ్పీహెచ్ స్కూల్(వెనిగండ్ల), రన్నర్‌గా జేఎంజే స్కూల్ విజయం సాధించాయి. అండర్- 14 ఖోఖో బాలుర విభాగంలో జెడ్పీహెచ్ స్కూల్ వెనిగండ్ల జట్టు ప్రథమ స్థానం, జేఎంజే నంబూరు రెండో స్థానం సాధించాయి. బాలికల విభాగంలో.. జెడ్పీహెచ్ వెనిగండ్ల విన్నర్, జేఎంజే నంబూరు రన్నర్‌గా నిలిచాయి. వాలీబాల్ అండర్- 17 బాలుర విభాగంలో జెడ్పీహెచ్ స్కూల్ వెనిగండ్ల విన్నర్, జెడ్పీహెచ్ స్కూల్, కొప్పురావూరు రన్నర్, బాలికల విభాగంలో జెడ్పీహెచ్ స్కూల్ వెనిగండ్ల విన్నర్, జెడ్పీహెచ్ స్కూల్ తక్కెళ్లపాడు రన్నర్‌గా నిలిచాయి. అండర్- 14 బాలుర విభాగంలో నంబూరు జేఎంజే స్కూల్ విన్నర్, కొప్పురావూరు జడ్పీహెచ్ స్కూల్ రన్నర్, బాలికల విభాగంలో వెనిగండ్ల జెడ్పీహెచ్ స్కూల్ విన్నర్, తక్కెళ్ళపాడు జెడ్పీ హెచ్ స్కూల్ రన్నర్‌గా నిలిచాయి. యోగ అండర్- 17, అండర్- 14 బాల బాలికల విభాగాలలో పెదకాకాని జెడ్పీహెచ్ స్కూల్ విద్యార్థులు విన్నర్, వెనిగండ్ల జెడ్పీస్కూల్ విద్యార్థులు రన్నర్‌గా నిలిచినట్లు పీఈటీ మస్తాన్‌రెడ్డి తెలిపారు. వ్యాయామోపాధ్యాయులు కొండయ్య, మరియన్న, అశోక్‌బాబు, చంటిబాబు పాల్గొన్నారు. శనివారం కబడ్డీ, చెస్, షటిల్ విభాగాల్లో పోటీలు ఉంటాయని చెప్పారు.

ఉల్లాసంగా క్రీడా ఎంపికలు

ప్రత్తిపాడు: స్థానిక భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా ఎంపికలు ఉల్లాసంగా సాగుతున్నాయి. మండల స్థాయి ఎంపికలను తొలి రోజు పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ షేక్ అబ్దుల్ రవూఫ్ ప్రారంభించారు. శుక్రవారం కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలను అండర్-14, అండర్-17 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా నిర్వహించారు. ఎనిమిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుంచి అధిక సంఖ్యలో క్రీడాకారులు ఎంపికల్లో పాల్గొన్నారు. ఆయా పాఠశాలల పీఈటీలు, పీడీల సమక్షంలో నిర్వహించిన సెలక్షన్లలో విద్యార్థులు తమ సత్తాను చాటుకున్నారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎంపికైన విద్యార్థులను ఈ నెల 24వ తేదీ నుంచి జరగనున్న నియోజకవర్గ స్థాయి పోటీల్లో ఆడించనున్నట్లు నియోజకవర్గ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ పి.డేవిడ్ రాజ్‌కుమార్ తెలిపారు.

గొర్లవారిపాలెంలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే



గుంటూరు రూరల్: మండలంలోని గొర్లవారిపాలెం గ్రామంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిన సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమంను నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి నల్లమేకల అప్పమ్మ, వైస్ ఎంపీపీ దర్శి సుజాత, ఎంపీడీఓ ఆదినారాయణ, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చెత్త నుంచి ఆదాయ మార్గాలు

ప్రత్తిపాడు: చెత్తను సక్రమంగా వినియోగించడం ద్వారా ఆదాయ మార్గాలు సృష్టించుకోవచ్చని స్వచ్ఛభారత్ మిషన్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్ డి. శ్రీనివాసరావు అన్నారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని ఈదులపాలెంలో తడి చెత్త, పొడి చెత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం క్లాప్ మిత్రలతో కలసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి తడి చెత్తను, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించారు. ప్రతి రోజూ తమ ఇళ్లకు వచ్చే క్లాప్ మిత్రలను వేర్వేరుగా చెత్తను విభజించి అందించాలని ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతను సామాజిక బాధ్యతగా తీసుకుని ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు మన ఇంటి పరాసరాలను స్వచ్ఛంగా ఉంచుకోవాలని కోరారు. తదనంతరం గొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి హేమంత్ క్లాప్ మిత్రలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి మాత్రలు అందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి.శివాజీ, నడింపాలెం ఎంఎల్‌హెచ్‌పీ ఒ.శివసాయి, ఏఎన్ఎం వి.అనిత, ఐటీసీ- ఫినిష్ సొసైటీ ప్రాజెక్టు అసోసియేట్ కోఆర్డినేటర్ ఉమామహేశ్వరి, వాటర్ ఎయిడ్ సంస్థ కమ్యూనిటీ ఫెసిలిటేట్ పి.వేణు పాల్గొన్నారు.

జొన్నలగడ్డలో స్వచ్ఛతా హి సేవ..

గుంటూరు రూరల్: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ గంగాదేవి తెలిపారు. శుక్రవారం జొన్నలగడ్డలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మొక్కలు నాటటంతో పాటు వాటి పరిరక్షణ భాధ్యతలు స్వీకరించాలన్నారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ప్రధాన రహదారుల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి మబ్బు శిరీష, వంగా నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగ మేళాలో 58 మంది ఎంపిక


ఇంటర్వ్యూలు చేస్తున్న కంపెనీల ప్రతినిధులు

చేబ్రోలు: చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఉద్యోగ మేళాకు 108 మంది నిరుద్యోగ యువతీ, యువకులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ వి.శ్రీదేవి శుక్రవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ఉపాధి కార్యాలయం సీడాప్ మరియు చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఉద్యోగ మేళాకు ఐదు కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. 58 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీదేవి తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ ఎ.రామకృష్ణారావు, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి పి.ఈశ్వరరావు, స్కిల్ హబ్ సమన్వయకర్త హనుమంతరావు, స్కిల్ హబ్ ట్రైనర్ రాంచందు పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ

పొన్నూరు: పట్టణంలోని విద్యానగర్‌లోని శేషారత్నం ఇంట్లో గురువారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. వివరాలు.. కుటుంబ సభ్యులతో ఊరికి వెళ్లి వచ్చిన శేషారత్నం దొంగలు తన ఇంటి కిటికీలు పగులగొట్టి బీరువాలోని రూ.50 వేల నగదు, 5 సవర్ల బంగారం అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ ఘటనా స్థలాన్ని పోలీసులుపరిశీలించారు.

సురక్షిత సమాజానికి పోలీస్ రక్షణ

గుంటూరు రూరల్: సురక్షిత సమాజాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పోలీసులు కృషి చేస్తున్నారని సీఐ వంశీధర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని చినపలకలూరు గ్రామంలో వారధి కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తామన్నారు. గ్రామంలో సీసీ కెమెరాలు దేవాలయాలు, ప్రధాన ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని సంబంధిత కమిటీలకు సూచించారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి

ప్రత్తిపాడు: తల్లిదండ్రులు, చిన్నారులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని ప్రత్తిపాడు సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్.భారతి అన్నారు. పోషణ మాసోత్సవాలలో భాగంగా శుక్రవారం ప్రత్తిపాడు సెక్టార్‌లోని రామనగర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో, గొట్టిపాడు సెక్టార్‌లోని వంగిపురం డీడబ్ల్యూ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు వ్యక్తిగత పరిశుభ్రత, వ్యాయామం, పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భోజనానికి ముందు తరువాత చేతులను ఎలా పరిశుభ్రం చేసుకోవాలి? యోగా, వ్యాయామంతో ఎలా ఆరోగ్యంగా ఉండాలి, గర్భిణులకు వెయ్యి రోజుల సంరక్షణ అన్న విషయాలను సూపర్‌వైజర్ భారతి తల్లులకు వివరించారు. భారతి మాట్లాడుతూ తల్లిపాలతో పాటు బిడ్డకు అనుబంధ ఆహారం అందించడం వలన పిల్లలు ఆరోగ్యవంతంగా ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు టి.జ్యోతిరాణి, నాగమణి పాల్గొన్నారు.


శుభ్రతపై తల్లులకు అవగాహన కల్పిస్తున్న భారతి

యూనియన్ బ్యాంక్ / యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ. 4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఏపీ - 520001.
E-mail: arb.vijayawada@unionbankofindia.bank

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ మరియు రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం పూర్వపు ఆంధ్రాబ్యాంక్ / కార్పొరేషన్ బ్యాంక్ ఇప్పుడు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, [illegible] అస్సెట్ రికవరీ బ్రాంచి, విజయవాడ కు [illegible] సదరు చట్టం సంబంధిత రూలు 8(6) ప్రకారం [illegible] ఇ-వేలం ద్వారా [illegible] ది. 29-10-2024న [illegible]

1) ఋణగ్రహీతలు / కో ఆబ్లిగెంట్స్ / తనఖాదారులు / హామీదారులు : 1. మెస్సర్స్ [illegible] ఇండస్ట్రీస్, ప్రొ॥ శ్రీమతి పంచార్యా కిరణ్ (ఋణగ్రహీత), భర్త : సురేష్ పంచార్యా, చిరునామా : డి.నెం. 11-782/4, [illegible] అమరావతి, గుంటూరు జిల్లా, ఏపి - 622034. 2. శ్రీమతి పంచార్యా కిరణ్ (తనఖాదారు), భర్త : సురేష్ పంచార్యా, చిరునామా : ఫ్లాట్ నెం. 401, 4వ అంతస్తు, సాయి [illegible] టవర్స్, 10వ లైన్, శ్యామలానగర్, గుంటూరు జిల్లా, ఏపి - 622003. 1. శ్రీ సీరం శ్రీనివాసరావు (హామీదారు) తండ్రి : గోవర్ధన్, చిరునామా : డోర్ నెం. 15-14-72/2, 5/5 లైన్, ఆర్‌టీసీ కాలనీ, గుంటూరు జిల్లా, ఏపి - 522001. 2. శ్రీమతి పంచార్యా కిరణ్ (హామీదారు), భర్త : సురేష్ పంచార్యా, చిరునామా : డి.నెం. 24-08-30, [illegible] గుంటూరు సిటీ, గుంటూరు జిల్లా, ఏపి - 522006.

బకాయి మొత్తం : ది.03-08-2017 నాటికి రూ. 59,99,728/- (అక్షరాలా [illegible] రూపాయలు మాత్రమే) కాంట్రాక్చువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు.

ఆస్తి వివరములు :

ఆస్తి నెం. 1 : గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు సబ్ డిస్ట్రిక్ట్, ఈదులపాలెం గ్రామ పంచాయితీ ఏరియా, ఈదులపాలెం గ్రామం డి.నెం. 15/1 [illegible] ఎకరా 5.57 సెంట్లు అందలి ఎకరా 2.57 సెంట్లలోని [illegible] 605 చ॥గులు [illegible] 4767/2015, తేది: 14-09-2015, [illegible] : 16.24177828, 80.32324464

రిజర్వు ధర : రూ. 25,71,250/- | ధరావత్తు : రూ. 2,57,200/- | బిడ్ పెంపుదల మొత్తం : రూ. 25,720/-

వేలం అమ్మకం యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం https://www.ebkray.in మరియు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్ సైట్ : www.unionbankofindia.co.in నందు చూడగలరు. [illegible] +91 8179226330, Mail ID: arb.vijayawada@unionbankofindia.bank లలో సంప్రదించవచ్చు.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూలు 8(6)/ రూలు 9(1) అనుసరించి చట్టబద్ధమైన 30 రోజుల అమ్మకం నోటీసు
[illegible]

తేది : 17-09-2024
ప్రదేశం : విజయవాడ
చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి, విజయవాడ

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ప్రత్తిపాడు డివిజన్
90109 57733 (ప్రత్తిపాడు)
90109 62225 (పొన్నూరు)
Office mail : sakshigntadvt@gmail.com